అలిపిరిలో కిక్కిరిసిన భక్తులు



పెరటాసి నెల రెండో శనివారం సందర్భంగా అలిపిరి పాదాల మండపం వద్ద భక్తుల సందడి నెలకొంది. కలియుగ వైకుంఠుడైన వెంకటేశ్వర స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన, పవిత్రమైన మాసం పెరటాసి. ఈ నెలలోని శనివారాల్లో భక్తులు ఉపవాసంతో స్వామికి పండితలిగలు వేసి, పిండి దీపాలు వెలిగించి పూజలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా పెరటాసి నెల రెండో శనివారం ఉదయం భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి అలిపిరి పాదాల మండపానికి చేరుకున్నారు. అక్కడ పండి తలిగలు వేసి, పిండి దీపారాలు పెట్టి గోవింద నామస్మరణ చేస్తూ తిరుమల వెంకన్నను భక్తితో కొలిచారు. అలిపిరి పాదాల మండపం భక్తజనంతో కిక్కిరిసింది. - తిరుపతి కల్చరల్



అలిపిరి పాదాల మండపం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు



క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శనివారం కేంద్ర మంత్రి రావు సాహెబ్ పాటిల్ దన్వే, తెలంగాణ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచలు అందించగా అధికారులు లడ్డూ, ప్రసాదాలతో సత్కరించారు.

అమ్మవారి సేవలో..

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శనివారం కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి రావ్‌సాహెబ్ పాటిల్ దన్వే దర్శించుకున్నారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం అందించగా అధికారులు తీర్థ ప్రసాదాలతో సత్కరించారు.

ముగిసిన ఆర్య వర్క్ శిక్షణ

తిరుపతి కల్చరల్: పద్మావతి మహిళా వర్సిటీలోని మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డి.ఉమాదేవి ఆధ్వర్యంలో రేణిగుంటలోని వీవో కార్యాలయంలో స్వయం సహాయక సంఘం మహిళలకు చేపట్టిన వారం రోజుల ఆర్య వర్క్ శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ ఆర్య వర్క్ నేర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాము ఉపాధి పొందుతూ మరి కొందరికి ఉపాధి అందిస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షకులకు ఉమాదేవి ఫ్రేమ్‌లను నీడిల్‌ను, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్ టి.పద్మావతి, ఎం.ఇంద్రాణి, సంఘ మిత్ర మనీలా, లక్ష్మీ, స్వయం సహాయక సంఘం మహిళలు పాల్గొన్నారు.

ఎస్వీయూకు రూ.40 లక్షల యూజీసీ గ్రాంట్ మంజూరు

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని యూజీసీ మానవ వనరుల కేంద్రానికి రూ.40 లక్షల నిధులు మంజూరైనట్లు వీసీ రాజారెడ్డి శనివారం తెలిపారు. 2023–2024 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సులకుగాను యూజీసీ నిధులు మంజూరు చేసిందని చెప్పారు. ఆయన శనివారం యూజీసీ హెచ్‌ఆర్ డీసీ డైరెక్టర్ విజయలక్ష్మికి గ్రాంటు మంజూరు పత్రాన్ని అందజేశారు. రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్, అప్పారావు, కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

పెరటాసి శనివారాల్లో ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: పెరటాసి నెల సందర్భంగా శనివారాల్లో తిరుమలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీవో) చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తులు వస్తారని చెప్పారు. వారికి ఇబ్బంది లేకుండా బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. సెప్టెంబర్ 28, 29 తేదీల్లో తిరువణ్ణామలైకి 134 సర్వీసులు ఏర్పాటు చేశామని వెల్లడించారు.

శ్రీవారి భక్తులకు అన్నదానం



తిరుచానూరు(చంద్రగిరి): పెరటాసి మాసం రెండో శనివారం కావడంతో కాలినడకన వస్తున్న శ్రీవారి భక్తులకు ఆర్కే కల్యాణ మండపం కూడలిలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఉదయం, సాయంత్రం సుమారు 1500 మంది భక్తులకు అన్నదానం చేసినట్టు సర్పంచ్ తెలిపారు. పెరటాసి నెలలోని ప్రతి శని, ఆదివారాల్లో అన్నదానం చేస్తామన్నారు. ఎంపీటీసీలు నరేష్ రెడ్డి, యోగానందరెడ్డి, వార్డు సభ్యులు లోకేష్ రెడ్డి, మునీంద్ర రాయల్ తదితరులు పాల్గొన్నారు.

భాష్యంలో టాలెంట్ హబ్




విద్యార్థినికి బహుమతి ఇస్తున్న టీచర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని భాష్యం పాఠశాలలో శనివారం విద్యార్థులతో టాలెంట్ హబ్ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పోస్టర్స్ ఆవిష్కరణ, మిమిక్రీ, హ్యాండ్ రైటింగ్, కథలు రాయడం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మణ్ మాట్లాడుతూ చదువుతో పాటు సమాజంపై అవగాహన, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి ఉన్నత ప్రమాణాలు పెంపొందించి సమాజానికి మంచి పౌరులను అందించాలన్న దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ బాలాజీ, లిటిల్ చాంప్స్ ఇన్‌చార్జ్ సుధాకుమారి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు సీహెచ్‌సీలో శనివారం స్విమ్స్, పద్మావతి ఆస్పత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఎంపీపీ యుగంధర్ రెడ్డి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్.వి.కుమార్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇక్కడ వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స చేసి మందులు అందస్తామన్నారు. వైద్య శిబిరానికి 320 మంది హాజరు కాగా 184 మందికి పరీక్షలు చేశారు. పద్మావతి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఉషాకళావతి, మెడికల్ ఆఫీసర్ శ్రీధర్, షీలాభాను పాల్గొన్నారు.

సాహితీ శైల పుస్తకావిష్కరణ



సాహితీ శైలం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, ఎంపీ గురుమూర్తి

తిరుపతి కల్చరల్: ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి అభినందన సంచిక సాహితీ శైలం పుస్తకాన్ని శనివారం గ్రాండ్ రిడ్జ్ హోటల్లో ఎంపీ విజయసాయిరెడ్డి ఆవిష్కరించారు. ఈ పుస్తకానికి సంపాదకులుగా డాక్టర్ కమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి వ్యవహరించారు. ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ఒక రచయితను అభినందిస్తూ ఆయన రాసిన గ్రంథాలను తన పరిశోధక విద్యార్థులు సమీక్షించి పుస్తకాన్ని తేవడం అభినందనీయమన్నారు. తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ పేటశ్రీ తిరుపతి అస్తిత్వాన్ని నిలబెట్టారని తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి క్షేత్రంపై జరిగిన పరిశోధనల్లాగే శ్రీకాళహస్తి క్షేత్రంపైనా చేయాలని కోరారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ పేటశ్రీ రచించిన తిరుపతి కథలు గ్రంథాన్ని ఎమెస్కో వారు ప్రచురించారంటే ఆ గ్రంథం ప్రామాణికతను అర్థం చేసుకోవచ్చని తెలిపారు. సీనియర్ పాత్రికేయుడు మీసరగండ పాండురంగ రాజు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్వుటా మాజీ అధ్యక్షుడు ఆచార్య పుట్టా మునిరత్నంరెడ్డి, ఆచార్య పేటశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేత బండారు సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలి



గజ్జల లక్ష్మి

తిరుపతి మంగళం : మంత్రి ఆర్కే రోజాపై అత్యంత జుగుప్సాకరంగా వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేత బండారు సత్యనారాయణపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని పోరాడుతున్న తరుణంలో టీడీపీ నేతల తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని తెలిపారు. సొంత పార్టీ నేతల వేధింపులను తట్టుకోలేక టీడీపీ మహిళా విభాగం నేతలు అనేక మంది బయటకు వచ్చారని గుర్తు చేశారు. టీడీపీ నేతల లైంగిక వేధింపులు మహిళా కమిషన్ దృష్టికి వచ్చినట్టు తెలిపారు. మహిళలను గౌరవించలేని రాజకీయ పార్టీల నేతలను బ్లాక్ లిస్టులో పెట్టి ఎన్నికల్లో పోటీచేయకుండా నియంత్రించాలని డిమాండ్ చేశారు.

వేరుశనగ క్షేత్రాల సందర్శన

పాకాల: ఇరంగారిపల్లి వద్ద ఏర్పాటు చేసిన వేరుశనగ చిరు ప్రదర్శన క్షేత్రాలను శనివారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్‌రావు సందర్శించారు. 2023 ఖరీఫ్‌లో రైతులకు వంద శాతం సబ్సిడీతో పంపిణీ చేసిన వేరుశనగ చిరు ప్రదర్శన విత్తనాలను విత్తారా లేదా అని ఆరా తీశారు. సాధారణ, కదిరి లేపాక్షి రకాల మధ్య ఉన్న వ్యత్యాసాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే దామలచెరువులలో ఈ–క్రాప్ బుకింగ్ తీరును పరిశీలించారు. ఏఓ పుష్పావతి, ఏఈఓలు రమేష్, అమీర్ పాల్గొన్నారు.

ఎంబీయూలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



శాస్త్రవేత్తలను సత్కరిస్తున్న ఎంబీయూ వీసీ నాగరాజ రామారావు

చంద్రగిరి: మండలంలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో మూడు రోజులుగా ఎనర్జీ కంట్రోల్ కంప్యూటింగ్ అండ్ ఎలక్ట్రానిక్ సిస్టమ్ అనే అంశంపై నిర్వహించిన నాలుగో అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఇందులో అమెరికాలోని నాసాలో విభాగాధిపతిగా పనిచేసిన డాక్టర్ వివేక్ ఆనందన్, బెంగళూరు ఐఐఎస్‌సీ సంస్థ రిటైర్డ్ చైర్మన్ ఆచార్య కేబీఆర్ వర్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ రంగంలో సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ప్రస్తుతం బాటరీ వాహనాల వినియోగం పెరిగిందన్నారు. విద్యార్థులు వీటిని అందిపుచ్చుకుని మరింత ముందుకు సాగాల ని సూచించారు. ఎంబీయూ వీసీ ఆచార్య నాగరాజ రామారావు పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం వారిని వీసీతో పాటు ఈఈఈ హెచ్‌ఓడీ సుజాత ఘనంగా సత్కరించారు. ఈశ్వర్, సతీష్, హరికృష్ణన్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన అవసరం



వెంకట్రావును సన్మానిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ: ఎస్సీ, ఎస్టీ చట్టాలపై విద్యార్థులు, గ్రామ సచివాలయాలు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు అవగాహన పెంచుకుని ప్రజల్లో చైతన్యం కలిగించాలని అడిషినల్ ఎస్పీ వెంకట్రావు పిలుపునిచ్చారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో శనివారం ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ఇప్పటికీ ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కొరవడిందన్నారు. వాటిపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అనంతరం అడిషల్ ఎస్పీ వెంకట్రావును జిల్లా, సీఐడీ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఝాన్సీలక్ష్మి, సోషియల్ వెల్ఫేర్ అధికారి చెన్నయ్య, డీఎస్పీ పద్మలత, జిల్లా ట్రైబల్ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష



మాట్లాడుతున్న ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి

రామచంద్రాపురం: ఆరోగ్యకర సమాజం కోసమే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మండలంలోని నెత్తకుప్పంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, స్పూటమ్ పరీక్షలతో పాటు జ్వరంతో బాధ పడుతున్న వారికి మలేరియా, డెంగీ తదితర 7 రకాల పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ ఢిల్లీరాణి, వైస్ ఎంపీపీ లావణ్య, సర్పంచి హిమాల్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, ఎంఈవో జయవేలు, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసమే

భాకరాపేట : ప్రజల ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎంపీపీ యుగంధర్‌రెడ్డి తెలిపారు. చిన్నగొట్టిగల్లు పంచాయతీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 45 రోజులు పాటు నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్షలో ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మనోహర్, ఎంపీడీవో దేవేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

చంద్రగిరి: పేదలకు ఆరోగ్య భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలుచేస్తోందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.ఎస్.ప్రతిభ, సూపర్‌వైజర్ శ్యామల తెలిపారు. చంద్రగిరి 1వ సచివాలయ పరిధిలో శనివారం ఇంటింటా సర్వే ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజల ఇంటి వద్దకు వెళ్లి ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించినట్లు తెలిపారు. వారికి ఏఎన్‌ఎంలు, క్లస్టర్ హెల్త్ ఆఫీసర్ వైద్య పరీక్షలు చేసినట్టు తెలిపారు. అనంతరం బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. డబ్ల్యూహెచ్ఎస్ బి.మోహన, ఆశా వర్కర్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



చిన్నగొట్టిగల్లులో చేపట్టిన స్వచ్ఛతాహి సేవా ర్యాలీ

భాకరాపేట: పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి తెలిపారు. చిన్నగొట్టిగల్లులో శనివారం స్వచ్ఛతాహి సేవాపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నగొట్టిగల్లులో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో దేవేంద్రబాబు, ఈవోపీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువుల వితరణ



వృద్ధాశ్రమంలో పుట్టిన రోజు వేడుకలను జరుపుకుంటున్న ఎంపీటీసీ దంపతులు

చంద్రగిరి: మండలంలోని నరసింగాపురం ఎంపీటీసీ అశ్విని, ప్రవీణ్ కుమార్ దంపతులు తమ కుమార్తె నిత్యశ్రీ పుట్టిన రోజు సందర్భంగా శనివారం నాగయ్యగారిపల్లి సమీపంలోని అరుణోదయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. నిత్యావసర సరుకులు వితరణ చేశారు. వృద్ధులతో కలిసి కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి, మదన్ మోహన్ పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



పాకాల : ధర్మ పరిరక్షణకు హిందువులు ఏకం కావాల్సిన అవసరం ఉందని సమరసత సేవా ఫౌండేషన్ జోనల్ ధర్మ ప్రచారకర్త వెంగల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఊట్లవారిపల్లి సమీపంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయం ఆవరణలో శనివారం ఆ ఫౌండేషన్ మండల కన్వీనర్, మాజీ వైస్ ఎంపీపీ తలారి బాలశంకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ చిన్నస్వామిరెడ్డి, జిల్లా సహ కన్వీనర్ శ్రీరాములురెడ్డి మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని పరిరక్షించే దిశగా ప్రతి నెలా ఒక్కో మండలంలో సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్య వంతులను చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా పోషకాహార మాసోత్సవాలు



తిరుపతి సిటీ: పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల హోమ్ సైన్స్ విభాగం విద్యార్థులు శనివారం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని పోషకాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి ఎంఆర్ పల్లి సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, పోషక విలువలను తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ కే.మహదేవమ్మ, అధ్యాపకులు నాగమణి, శ్రీవాణి, చెంచులక్ష్మి, వాణి ప్రశాంతి, ఉమారాణి పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డికి భూమన సత్కారం



తిరుపతి మంగళం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ దక్షిణ కోస్తా జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని శనివారం టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన సతీమణి భూమన రేవతి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. విజయసాయిరెడ్డి తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో భూమన కుటుంబ సభ్యులను మర్యాద పూర్వకంగా కలిశారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం కల్యాణోత్సవం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలిసి తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గోపీనాథ్, టెంపుల్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్ రెడ్డి, ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశం కల్పించాలని వినతి



వినతి పత్రం ఇస్తున్న రూయా మాజీ కాంట్రాక్ట్ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: రూయాలో ఉద్యోగులను నియమించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, తమకు అవకాశం కల్పించాలని రూయా కాంట్రాక్ ఉద్యోగులు కోరారు. వారు శనివారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తాము కోవిడ్ సమయంలో బాధ్యతగా పనిచేశామని చెప్పారు. తర్వాత తమను తొలగించారని పేర్కొన్నారు. తాజాగా భర్తీ చేస్తున్న వారితోపాటు తమకూ అవకాశం కల్పించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించి మంగళవారం సమావేశం నిర్వహిస్తామని, లోటుపాట్లు చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. రూయా మాజీ కాంట్రాక్ట్ ఉద్యోగులు విజయానంద్, సుబ్రహ్మణ్యం, బాపూజీ నాయక్, శంకర్‌రావు, రెడ్డి ప్రసాద్, సుబ్రహ్మణ్యం, కిరణ్ కుమార్, పురుషోత్తం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కవి సమ్మేళనం

తిరుపతి సిటీ: తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శనివారం అఖిల భారతీయ భాషా కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. వీసీ క్రిష్ణమూర్తి, తెలుగు కళా వేదిక అధ్యక్షులు కోడూరు సుమనశ్రీ, రంగాచార్యులు తెలుగు భాషా ఖ్యాతిని వివరించారు. కార్యక్రమంలో లంకా వెంకట నరసింహం, రఘువాచార్యులు, లీనా చంద్ర, బుల్లీదాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి



మాట్లాడుతున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి కల్చరల్: మహిళలు స్వశక్తితో ఎదగాలని మేయర్ డాక్టర్ శిరీష పిలుపునిచ్చారు. ఆమె శనివారం యువజన సర్వీసుల శాఖ, సెట్విన్, మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా చెన్నారెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలుచేస్తోందన్నారు. సెట్విన్ సీఈవో వి.మురళీకృష్ణ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందే విధంగా జిల్లా కలెక్టర్ అనుమతితో వివిధ పథకాలకు రూపకల్పన చేస్తున్నట్టు తెలిపారు. త్వరలో వివరాలు తెలియజేస్తామని తెలిపారు. చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మబ్బు సూర్యనారాయణ మాట్లాడుతూ మహిళల కోసం చేపట్టే ఏ కార్యక్రమమైనా తమ ట్రస్ట్ సంపూర్ణ సహకారం అందజేస్తుందని తెలిపారు. దిశ టీం ఏఎస్ఐ రోహిణి, 39వ వార్డు కార్పొరేటర్ పునీతి, వార్డు కార్యదర్శి, ప్రసూన చారిటబుల్ ట్రస్ట్ కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: కోదండ రామాలయంలో అక్టోబర్‌లో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా 7న పునర్వసు నక్షత్రం సందర్భంగా ఆలయంలో ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల ద్వారా రామచంద్ర పుష్కరిణి వద్దకు వేంచేపు చేస్తారు. అక్కడ సాయంత్రం 6.30 గంటలకు ఊంజల్ సేవ నిర్వహిస్తారు. 14వ తేదీ అమావాస్య సందర్భంగా ఉదయం 6.30 గంటలకు సహస్ర కలశాభిషేకం చేపడతారు. అదే రోజు రాత్రి 7 గంటలకు హనుమంత వాహన సేవ జరగనుంది. 28వ తేదీన పౌర్ణమి సందర్భంగా ఉదయం 9 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు ఆలయ నాలుగు మాడ వీధుల నుంచి రామచంద్ర పుష్కరిణి వరకు తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు ఆస్థానం చేపడతారు.

రేపటి నుంచి ఎస్వీ జూలో వన్యప్రాణి వారోత్సవాలు

తిరుపతి మంగళం : ఎస్వీ జూపార్క్‌లో సోమవారం నుంచి వారం రోజులు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించనున్నట్టు క్యూరేటర్ సెల్వం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తామని, పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు జూలోకి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు చెప్పారు. సోమవారం వన్యప్రాణి వారోత్సవాల ప్రారంభం, ఫొటో ఎగ్జిబిషన్‌తో పాటు ఫొటో కాంపిటేషన్ ఉంటుందని, 3న మోహన్‌బాబు యూనివర్సిటీ సేవ్ వైల్డ్ లైఫ్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 4న జంతు అలవాట్లపై విద్యార్థులకు డ్రాయింగ్, 5న జంతువులపై వ్యాస రచన, 6న ఇండియాలోని జంతువులపై క్విజ్ పోటీలు, 7న వన్యప్రాణి వారోత్సవాలపై కార్యక్రమం, 8న వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, జూ అధికారులు, సిబ్బందితో ర్యాలీ ఉంటుందని తెలిపారు.